క్లుప్తంగా

రామ్‌కోలో రక్తదాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్స్ ఫౌండర్ రామస్వామి రాజు జయంతిని పురస్కరించుకుని బుధవారం కల్వటాల సమీపంలోని ఫ్యాక్టరీలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రామ్‌కో అడ్మిన్‌హెడ్ రామరాజు, యూనిట్‌హెడ్ మీనాక్షి సుందరం ప్రారంభించారు. నంద్యాలకు చెందిన ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పాల్గొని రక్తాన్ని సేకరించారు. కంపెనీకి చెందిన 165 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రామస్వామి రాజు ఎన్నో పరిశ్రమలను నెలకొల్పి ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన జయంతి సందర్భంగా సంస్థ ఉద్యోగులు రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు తెలిపారు. సమావేశం నిర్వహించేందుకు కావాల్సిన కోరం లేకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామనేది తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

కొలిమిగుండ్ల: యర్రగుడిలో దళితులకు శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 50 దళిత కుటుంబాలు ఉన్నాయని.. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందిగా మారుతోందన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఉన్న స్థలంలో కర్మకాండలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రదేశంలో ఉపాధి హామీ పనులు చేస్తున్నారని తెలిపారు. ఎస్సీల శ్మశానం కోసం శాశ్వతంగా ఉండేలా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమిని గుర్తించి తప్పక కేటాయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

దళితులను అవమానించడం తగదు

కొలిమిగుండ్ల: సమాజంలో దళితులను అవమానించడం తగదని దళిత సంఘాల నాయకుడు సుబ్బారాయుడు అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో దళితులను అవహేళనగా చూడడంపై బుధవారం దళిత సంఘాల నాయకులతో కలిసి తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లు అయినా ఇంకా దళితులపై దాడులు, అవమానాలు జరగడం బాధాకరమన్నారు. మండలంలో సైతం ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు స్వామిదాసు, కర్ణయ్య, ఇస్మాయిల్, ధనపాల్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల గ్రామ బహిష్కరణ అమానుషం

బనగానపల్లె రూరల్: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో దళితులను గ్రామ బహిష్కరణ చేయడం అమానుషమని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దస్తగిరి అన్నారు. బుధవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఐదు రోజుల క్రితం దళిత యువకుడు సురేష్ విద్యుత్ షాక్‌తో మరణిస్తే, దళితులు నిరసన తెలిపారన్నారు. దీంతో అగ్రవర్ణాలకు చెందినవారు దళితులను గ్రామ బహిష్కరణ చేసిన్నట్లు ఆరోపించారు. ఇంత జరిగినా హోం మంత్రి అనిత గ్రామాన్ని సందర్శించకపోవడం బాధాకరమన్నారు. నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై నిరసన



డోన్‌లో కొవ్వొత్తులతో హిందూ పరిరక్షణ సమితీ సభ్యుల నిరసన

కోవెలకుంట్ల/డోన్ టౌన్: మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి హిందూ పరిరక్షణ సమితి, బీజేపీ, వివిధ ప్రజా సంఘాలు, సమరత సేవా సంస్థ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల, డోన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. మానవహారంగా ఏర్పడి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదం మానవాళికే ప్రమాదమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న, సందు వెంకటరమణ, అప్పపోగు సుబ్బయ్య, వడ్డె సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరు కొత్తపేటలో సర్వే నంబర్–7 ప్రభుత్వ డీపట్టా భూమిలో గ్రామానికి చెందిన తలారి కొమ్ముశివుడు బుధవారం అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టాడు. మట్టిని రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని సమాచారం. దీనిపై తహసీల్దార్ నారాయణరెడ్డిని వివరణ కోరగా మట్టి తవ్వకం విషయం తెలియగానే నిలిపివేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

‘పది’ ఫలితాల్లో ప్రతిభ

- సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



ఉసేన్‌బాషా(589), కరీష్మ(578), యశస్విని(576), జహరూన్(574), ఐయిషా(572)



ప్రవీణ(571), మణి(571), సుల్తాన(561)

కోవెలకుంట్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 108 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 71 శాతం (77మంది) ఉత్తీర్ణులయ్యారు. ఉసేన్‌బాషా 589 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. అలాగే జగదీష్ 534 మార్కులు, ప్రవీణ్ 533 సాధించినట్లు హెచ్‌ఎం రాజయ్య పేర్కొన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 111 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కాగా 84 మంది పాస్‌తో 76శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం అరుణకుమారి చెప్పారు. కరిష్మ 578 మార్కులు, జహరూన్ 574, ప్రవీణ 571, సుల్తానకు 561 మార్కులు వచ్చినట్లు వెల్లడించారు. పట్టణ శివారులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 75 మంది విద్యార్థినులకు 73 మంది పాసై 97.5 శాత ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. యశస్విని 576 మార్కులు, ఐయిషా 572, మణి 571 మార్కులు సాధించారన్నారు. ఉర్దూ ఉన్నత పాఠశాలలో 12 మంది విద్యార్థులు పరీక్షలు కాయగా 10 మందితో 83.3 శాతం పాసైనట్లు హెచ్‌ఎం మారూఫ్ ఉసేన్ చెప్పారు. మండలంలోని రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 76 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 55 మంది ఉత్తీర్ణతతో 72 శాతం సాధించినట్లు హెచ్‌ఎం సుందరయ్య తెలిపారు. కాశీవిశ్వనాథరెడ్డి 574 మార్కులు, మహబూబ్‌బాషాకు 528 మార్కులు వచ్చాయన్నారు. భీమునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25మంది విద్యార్థులకు 21 మందితో 84 శాతం సాధించినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు వెల్లడించారు. సుమిత్ర 557మార్కులతో ప్రతిభ కనబరిచిందన్నారు. గుళ్లదూర్తి జెడ్పీ పాఠశాలలో 27 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17 మంది పాసై 63 శాతం ఉతీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం ప్రసాదమూర్తి పేర్కొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో 95శాతం ఉత్తీర్ణత

పట్టణంలోని బీసీ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. బీసీ బాలుర వసతి గృహానికి సంబంధించి 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17 మంది పాసై 95 శాతం ఉత్తీర్ణులైనట్లు హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి చైతన్యలక్ష్మి తెలిపారు. ఇందులో ఐదుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారన్నారు. ఉసేన్‌బాషాకు 589 మార్కులు, సద్దాం ఉసేన్‌కు 582, సాయికిరణ్‌కు 546, జగన్‌కు 522, ఉసేన్‌వలికి 513 మార్కులు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే ఎస్సీ బాలికల వసతిగృహంలో 17 మందికి గాను 16 మంది ఉత్తీర్ణులైనట్లు హెచ్‌డబ్ల్యూఓ వనజాక్షి చెప్పారు. ఎనిమిది మంది విద్యార్థినులకు 500లకు పైగా మార్కులు రాగా సమీరకు 565 మార్కులు, జాస్మిన్‌కు 555, టి. శ్రవంతి 553, అలీమా 549, ఎం.శ్రవంతి 537, సుమశ్రీకి 530, శరణ్య 512, అనుషకు 509 మార్కులు వచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని గుళ్లదూర్తి బీసీ బాలుర వసతిగృహంలో తొమ్మిది మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఆరుగురు వివిధ శ్రేణుల్లో ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌డబ్ల్యూఓ ఎర్రమ్మ తెలిపారు.

పేదింటి ఆణిముత్యం



తల్లితో ఉసేన్‌బాషా

కోవెలకుంట్ల: పదో తరగతి ఫలితాల్లో పేదింటి గ్రామీణ ఆణిముత్యం మెరిసింది. దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెకు చెందిన మహబూబ్‌బాషా అమినాబీ దంపతుల కుమారుడు ఉసేన్‌బాషా మంచి మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. తండ్రి రెండు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. పెద్దకుమారుడు ఉసేన్‌వలి ట్రిపుల్ ఐటీ మూడో సంవత్సరం బీటెక్ చదువుతున్నాడు. రెండో కుమారుడు ఉసేన్‌బాషా కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేసుకున్నాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో 600 మార్కులకు 589 మార్కులు సాధించి సత్తా చాటాడు. సైన్స్‌లో వందకు వంద మార్కులు, మిగిలిన అన్ని సబ్జెక్టుల్లో 95కు పైగా మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు పడుతున్న కష్టానికి కుమారుడికి మంచి మార్కులు రావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ట్రిపుల్ ఐటీలో సీటు వస్తే బీటెక్ లేదా పాటిటెక్నిక్ చేసి ఇంజినీర్‌గా రాణించాలన్నదే తన ముందున్న లక్ష్యమని ఉసేన్‌బాషా తెలిపాడు.

ప్రైవేట్ విద్యార్థుల విజయదుందుభి



హరిత(591), ముస్తఫా ఆలీ(589), లక్ష్మి(576), రాధిక(566)

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో హరిత అనే విద్యార్థిని 591 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. వికాస్ హైస్కూల్‌లో ముస్తఫాఆలీ 589 మార్కులు, హర్షిత 584, చరణ్ 583 మార్కులు పొందినట్లు కరస్పాండెంట్ వినోద్ పేర్కొన్నారు. చిదానంద హైస్కూల్‌లో రాధిక 566 మార్కులు, జస్సిక, అంజలి 559 మార్కులు పొందినట్లు కరస్పాండెంట్ గురుస్వామి వెల్లడించారు. ప్రగతి పబ్లిక్ స్కూల్‌లో లక్ష్మి 576 మార్కులు, సుబ్బలక్షయ 571, ఖతిజాబీ 567 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ ఎస్‌ఏ గఫూర్ చెప్పారు. సప్తగిరి పాఠశాలలో సోనాలికి 582 మార్కులు వచ్చినట్లు కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి వివరించారు.

బాలికలదే పైచేయి



విజయలక్ష్మి(590), శశిరేఖ(587)



విజయదుర్గ ప్రసాద్(597), రుషిక(594), జహీర్(590), కార్తీక్(590), శ్రీవర్షిణి(590), శ్రీహరిణి(589)

డోన్ టౌన్: ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలికలు ఫలితాల్లో పైచేయి సాధించారు. పట్టణంలోని బాలికల హైస్కూల్‌కు చెందిన బి.విజయలక్ష్మీ 590 మార్కులతో సత్తాచాటింది. ఇదే స్కూల్‌కు చెందిన శశిరేఖ 587, ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన రాజేశ్వరి 584 మార్కులతో అదరగొట్టారు. కొచ్చెర్వు పాఠశాలలో 75 శాతం, యు.కొత్తపల్లె పాఠశాలలో 78, చిన్నమల్కాపురం 63, ఎద్దుపెంట 40, మల్లెంపల్లె 70, కొత్తపేట 46, నెహ్రూనగర్ కాలనీ 75, గర్ల్స్ హైస్కూల్ 69, పాతపేట 62, మహాత్మాజ్యోతిరావు పూలే 97, కేజీబీవీ 68, ఏపీ మోడల్ స్కూల్ 73, ఏపీఎస్‌ఆర్ డబ్ల్యూఎస్ పాఠశాలలో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 69.67 శాతం ఉత్తీర్ణత వచ్చినట్లు ఎంఈఓలు ప్రభాకర్, రామనర్సప్ప తెలిపారు.

శ్రీసుధ విజయకేతనం



వెంకటశ్వేత(586)

డోన్ టౌన్: పదో తరగతి ఫలితాల్లో పట్టణానికి చెందిన శ్రీసుధ విద్యా సంస్థల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. పాఠశాలలో 97 శాతం ఉత్తీర్ణతతో పాటు 500 మార్కులకుపైగా 109 మంది విద్యార్థులు సాధించారు. పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ జ్ఞానశేఖర్, నాగరాణి దంపతుల కుమారుడు కె.విజయదుర్గ ప్రసాద్ 597 మార్కులతో సత్తా చాటాడు. కె.రుషిక 594, బి.కార్తీక్, ఈ.శ్రీవర్షిణి, ఎస్ఎండీ జహీర్ 590, జె.శ్రీహరిణి, ఏ.వర్షిణి 589, టీవీ శ్వేత, డి.శివ 586, ఎస్.గోపీకృష్ణ 584, ఏ.సాత్విక్, లక్ష్మీహన్షిక 583, ఎస్.రియాజ్, షబియా 581, జె.వర్షిత 580, ధీరజ్, అవనాష్, సామియా 579, చరణ్‌తేజ్, ధరణి 578 మార్కులతో ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను పాఠశాల యజమాన్యం సుదర్శన్, వేణుగోపాల్, రాజాసుధాకర్‌గుప్త, సూర్యనారాయణ అభినందనలు తెలిపారు.

రెసిడెన్షియల్ విద్యార్థుల హవా



జీనత్ జోహ-592,సాయి నమ్రత-587, సర్దార్-587, మహేష్ బాబు-573, షమీరా-569, హారిక- 568



దివ్యాంజలి-568, తిరుపాల్ నాయక్-567,శ్రీకాంత్-567

బేతంచెర్ల: మండలంలోని బీసీ రెసిడెన్షియల్ విద్యార్థులు పది ఫలితాల్లో 89.19 శాతం ఉత్తీర్ణ సాధించారు. మహేష్ బాబు 573 మార్కులు, తిరుపాల్ నాయక్, శ్రీకాంత్ 567 మార్కులు సాధించారు. హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి షమీరా 569, మెయిన్ జెడ్పీ హైస్కూల్‌లో హారిక 568, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని మేఘన 566 మార్కులు తెచ్చుకున్నారు. అలాగే కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో దివ్యాంజలి 568 మార్కులతో ప్రతిభ చూపింది. మండలంలో మొత్తం 1096 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 848 మంది పాస్ అయ్యి 77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సోమశేఖర్ వెల్లడించారు. అలాగే ప్రైవేటు పాఠశాలలో సయ్యద్ జీనాద్ జోహ 592, ఆదిత్య కృష్ణ 590, వైష్ణవి 588, మహిత్ 583, పవన్ కుమార్ 581, పావని 580 సాధించారు. సుమేధా స్కూల్‌లో సాయి నమ్రత, సర్దార్ 587 మార్కులతో ప్రతిభ చాటారు.

బనగానపల్లెలో 64 శాతం ఉత్తీర్ణత



టి.షణ్ముఖశ్రీ- 579, వెంకట భవ్య-578

బనగానపల్లె రూరల్: మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 64.05 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. మొత్తం 15 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1096 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఇందులో 702 మంది విద్యార్థులతో 64.05 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు వెల్లడించారు. బనగానపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టి.షణ్ముఖశ్రీ 579, పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జి. వెంకటభవ్య 578, ఇల్లూరుకొత్తపేటకు చెందిన అనిత 565, ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన మహబూబ్‌బాషా 565, కేజీబీవి పాఠశాలకు చెందిన స్వాతి 547 మార్కులతో ప్రతిభ చాటినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 12 ప్రైవేట్ పాఠశాలకు చెందిన 474 మంది పరీక్షలు రాయగా 455 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.



మనీషా(575), సుమశ్రీ(574), ఎంవీ హర్షవర్ధన్(574), సి. హర్షవర్ధన్(567), కార్తీక్(562)

అంకిరెడ్డిపల్లె విద్యార్థుల ప్రతిభ

కొలిమిగుండ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. ఇందులో అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. వీరిలో బంగారు మనీషా 575 మార్కులు, సుమశ్రీ 574, ఎంవీ హర్షవర్ధన్‌కు 574, సి.హర్షవర్ధన్‌కు 567 మార్కులు వచ్చాయి. మోడల్ స్కూల్‌కు చెందిన కార్తీక్ 562 మార్కులు సాధించారు. ఈ పాఠశాలలో 20 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో 36 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరై అందరూ పాస్ కావడంతో వంద శాతం ఫలితాలు నమోదయ్యాయి. చంద్రకళ, తేజస్వినికి 555 మార్కులు వచ్చాయి. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో 74 శాతం ఫలితాలు వచ్చాయి. మౌనికకు 559, సాయి మహితకు 557 మార్కులు సాధించారు. మొత్తంగా మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి 533 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 417 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని చల్లా ప్రణతి 589 మార్కులు సాధించింది. రామకృష్ణ పాఠశాల విద్యార్థిని సాయి మౌనికకు 586 మార్కులు వచ్చాయి. విద్యార్థులకు ఎంఈఓ అబ్దుల్ కలాం శుభాకాంక్షలు తెలిపారు.



పి.రాకేష్-583,పి.జీవన్-580,గౌతమ్-575, సుప్ర జ్యోత్స్న-574,సాయి రిషిత-591,యోగేంద్ర యాదవ్-591

అవుకులో 73 శాతం ఉత్తీర్ణత

అవుకు: మండలంలో 12 ప్రభుత్వ పాఠశాలలు, 2 ప్రైవేటు పాఠశాలల్లో కలిపి 73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ శ్రీధర్ రావు వెల్లడించారు. ఆదర్శ పాఠశాలలో పి.రాకేష్ 583, పి.జీవన్ 580, టి. గౌతమ్ 575, సుప్ర జోత్స్న 574 మార్కులు, గుండ్లశింగవరం పాఠశాలలో పూజిత 574 మార్కులు, అవుకు బాలికల పాఠశాలలో నాగవైష్ణవి 569, శ్రావణి 569, సంగపట్నం పాఠశాలలో నూర్జహాన్ 563 మార్కులు, అవుకు బాలుర పాఠశాలలో నగిరి ఆనంద్ 547 మార్కులు, చెన్నంపల్లె పాఠశాలలో జె సుమంత్ 542 మార్కులు, సుంకసుల పాఠశాలలో హర్షవర్ధన్ 532 మార్కులు, కునుకుంట్ల పాఠశాలలో రాజభూపాల్ 527 మార్కులు, కేజీబీవీ పాఠశాలలో షర్మిల 523 మార్కులు, మంగంపేటలో కమల 503 మార్కులు సాధించారు. అలాగే అవుకులోని మదర్ మోడల్ స్కూల్ విద్యార్థులు మామిళ్ల సాయి రిషిత 591, గొల్ల యోగేంద్ర యాదవ్ 591, ఎస్.పద్మ శివాలి 586, లావణ్య 586, స్వాతి 586 మార్కులు సాధించారు.

సంజామల విద్యార్థుల సత్తా



సల్మా-584, గుర్కావైష్ణవి-584

సంజామల: నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సల్మా, గుర్కా వైష్ణవి 584 మార్కులతో సత్తా చాటారు. అలాగే కేజీబీవీ విద్యార్థిని వర్షిని 579, నొస్సం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పైబియా సుల్తాన 571 మార్కులు సాధించారు. మండలంలో మొత్తం 341 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 251 మంది పాస్ అయినట్లు ఎంఈఓ ఈశ్వరయ్య తెలిపారు. పేరుసోముల ఉన్నత పాఠశాలకు చెందిన చంద్రిక 561, కానాల– సమీర 555, ఆల్వకొండ –అరుణ్ బాషాకు 550 మార్కులు వచ్చాయి.

మెరిసిన విద్యా కుసుమాలు



షేక్ సుహానా (584), జగదీశ్ (575)



లహరి (570), ఆయేషా (569)

ప్యాపిలి: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ సుహానా 584 మార్కులతో సత్తా చాటింది. జలదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జగదీశ్ 575, పీఆర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పాయసం లహరి 570, ప్యాపిలి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన అయేషా 569 మార్కులు, భారతి 566 మార్కులతో మంచి ప్రతభను కనబరిచారు.

డోన్ డివిజన్‌లో 77 శాతం ఉత్తీర్ణత

కోవెలకుంట్ల: పదో తరగతి ఫలితాల్లో డోన్ డివిజన్‌లో 77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలో 119 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ ఏడాది 6,280 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 4,813 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డోన్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విజయలక్ష్మి 590 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల టాపర్‌గా నిలిచిందని వెల్లడించారు.



డోన్ ఎస్సీ బాలికల హాస్టల్ నుంచి కుమార్తెను తీసుకెళ్తున్న మహిళ



కోవెలకుంట్ల: లగేజీతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు



హాస్టల్ వద్ద ఆటో కోసం ఎదురుచేస్తున్న విద్యార్థులు

సెలవులొచ్చాయ్..!



డోన్ ఏపీ గురుకుల పాఠశాల నుంచి తండ్రితో బైక్‌పై వెళ్తున్న విద్యార్థి

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. బుధవారం చివరి రోజు కావడంతో తల్లిదండ్రులు డోన్, కోవెలకుంట్లలోని హాస్టళ్లకు వచ్చి లగేజీ తీసుకుని తమ పిల్లలతో ఇంటి బాట పట్టారు. విద్యార్థులు తమ స్నేహితులతో కాసేపు ముచ్చటించి టాటా చెప్పి స్వస్థలాలకు పయనమయ్యారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు విద్యార్థులు, వారి సామగ్రితో కిక్కిరిసి పోయాయి. ఏడాది పాటు పుస్తకాలు, పరీక్షలు, హోంవర్కులతో కుస్తీ పడ్డ విద్యార్థులు 50 రోజుల పాటు సెలవులను ఆస్వాదించనున్నారు. స్కూళ్లు తిరిగి జూన్ 12న ప్రారంభం కానున్నాయి. కాగా 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన తమ సీనియర్లకు అభినందనలు తెలుపుతూ మరోవైపు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన వారికి ధైర్యం చెబుతూ పెద్ద మనసు చాటుకున్నారు.

–డోన్/కోవెలకుంట్ల



కోవెలకుంట్ల గురుకుల పాఠశాల నుంచి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

గ్రామీణ బాహుబలులు



గుండును ఎత్తుతున్న గోసానిపల్లె చందు

బేతంచెర్ల: పట్టణంలో సయ్యద్ అల్లాబకాష్ వలీ ఉరుసును పురస్కరించుకుని బుధవారం దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 130 కేజీల గుండు, ఇసుక సంచి, 75 కేజీల చంద పందెం పోటీలు రసవత్తరంగా జరిగాయి. యువకులు పోటాపోటీగా గుండు, ఇసుక, చందలను ఎత్తారు. గుండు పందెంలో ప్యాపిలి మండలం గోసానిపల్లెకు చెందిన చందు విజేతగా నిలిచాడు. వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి సుధాకర్ ద్వితీయ స్థానం సాధించారు. ఇసుక సంచి పందెంలో పుల్ల గుమ్మి సుధాకర్ ప్రథమ, ప్యాపిలి మండలం గోసానిపల్లె చందు ద్వితీయ, చంద పందెంలో వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామానికి చెందిన సుధాకర్, శివ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు వెండి పతకాలు బహూకరించారు.



చందను ఎత్తుతున్న శివ